క్లుప్తంగా

గ్రామీణాభివృద్ధిపై శిక్షణ తరగతులు

కాజులూరు: గ్రామీణ అభివృద్ధిపై మండల పరిషత్ సమావేశ భవనంలో 14వ తేదీ గురువారం జరగనున్న శిక్షణ తరగతులను సంబంధిత అధికారులు, సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ జె.రాంబాబు అన్నారు. తన కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఆరు గంటల వరకూ జరుగు ఈ శిక్షణలో జీపీడీపీ, బీపీడీపీ, డీపీడీపీ నిధుల వినియోగంపై నిపుణులైన అధికారులు శిక్షణ ఇస్తారన్నారు. గ్రామ పంచాయతీ కార్యాదర్శులు, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓలు, స్త్రీ శిశుశక్తి ఏపీఎం, మండల వ్యవసాయాధికారి, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ, పీహెచ్‌సీల వైద్యాధికారులు, పశువైద్యాధికారులు, ఈఓపీఆర్డీ, మండల పరిషత్ కప్యూటర్ ఆపరేటర్లు విధిగా హాజరు కావాలన్నారు. శిక్షణ తరగతులకు వచ్చే వారంతా వారి ఆధార్ కార్డు తీసుకురావాలన్నారు.

ఎకరాకు 35 బస్తాల దిగుబడి

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెల్ల గ్రామంలో రైతు ఈత బంగారయ్య పొలంలో బుధవారం నిర్వహించిన పంట కోత ప్రయోగంలో ఎకరాకు 35 బస్తాల దిగుబడి వచ్చినట్లు తేలిందని మండల వ్యవసాయ అధికారి ఎస్.సత్యప్రసాద్ విలేకరులకు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకుడు పి.సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

భవిత కేంద్రాల ప్రత్యేకతను చాటాలి

కపిలేశ్వరపురం/మండపేట: భవిత కేంద్రాల ప్రత్యేకతను ఐఈఆర్టీలు సమాజానికి చాటాలని సమగ్ర శిక్ష కోనసీమ జిల్లా కో–ఆర్డినేటర్ కేవీవీ సత్యనారాయణ ఆదేశించారు. నియోజకవర్గంలోని కపిలేశ్వరపురం, మండపేటలలోని భవిత కేంద్రాలను ఆయన బుధవారం సందర్శించారు. ఆయా కేంద్రాలను పర్యవేక్షిస్తున్న ఐఈఆర్టీల పనితీరును పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. చిన్నారులకు అందిస్తున్న ఫిజియో థెరపీ సేవలను పరిశీలించారు. మానవతా దృక్పథంతో కేంద్రంలో సేవలందించాలన్నారు. అనంతరం మండపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న ప్రతిభా పోటీలను పరిశీలించి అభినందించారు.

వరి కోతల వేళ జాగ్రత్తలు అవసరం

వ్యవసాయాధికారి సూచనలు


కాజులూరులో వరి పంట కోత కోస్తున్న రైతులు

కాజులూరు: నియోజకవర్గంలోని గ్రామాల్లో ప్రస్తుతం వరి పంట మాసూళ్ల పనులు ముమ్మరంగా ప్రారంభమయ్యాయి. అల్పపీడన ప్రభావంతో వాతావరణం మబ్బులు, ముబ్బులుగా ఉండి అక్కడక్కడా చెదురుమదురు చినుకులు పడుతుండటంతో పంటను ఒబ్బిడి చేసుకునేందుకు రైతులు తొందరపడుతున్నారు. అయితే పంట కోతల సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే నష్టతీవ్రత ఎక్కువగా ఉంటుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. కోతల సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి కాజులూరు మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అందిస్తున్న సూచనలు ఆయన మాటల్లోనే...

పంట కోతలు కోసే ముందు పంట రకాన్ని బట్టి పంట కాలవ్యవధి ఎన్నిరోజులు అన్నది ముందుగా గుర్తించాలి. పంట కోత సమయానికి 10 రోజులు ముందు పొలంలో నీటిని పూర్తిగా తీసివేయాలి. కంకి లోని చివరి గింజ తోడుకునేంత వరకూ పంట కోత కోయరాదు. వరి గింజ పంటికింద ఉంచి కొరికినప్పుడు ఫట్ మని శబ్దంతో గింజ విరగాలి. వరి పనలు కోసిన తర్వాత రెండు రోజులు ఆరనిచ్చి తిరగవేసి మరో రెండు రోజులు ఎండనిచ్చి మాసూళ్లు చేసుకోవాలి. గింజలో తేమ 17 శాతం ఉన్నప్పుడే మంచి ధర వస్తుంది. కాబట్టి పంట పూర్తిగా పక్వానికి వచ్చిన తర్వాతే కోత కోయాలి. విత్తన వరిపంట సాధారణ పంట కంటే 15 నుంచి 20 రోజులు ముందుగానే కోతకు వస్తుంది. విత్తన వరి సాగు చేసిన పొలాల్లో కోత సమయంలో పక్కపొలం నుంచి నీరు రాకుండా ముందుగానే గట్టు ఎత్తుగా ఉండేలా ఏర్పాటు చేసుకోవాలి. ఉదయం మంచు పడే అవకాశం ఉన్నందున మంచు ఆరిన తర్వాతే కోత ప్రారంభించాలి. వరి కోతలో యంత్రాలను వినియోగిస్తే అవి సక్రమంగా పనిచేస్తుందో లేదో గమనించాలి. లేకుంటే గింజలు నష్టపోయే ప్రమాదం ఉంది. కోత సమయంలో మొక్క కింది భాగం కంకి వరకు కోయాలి. దీని వలన కాండం తొలచు పురుగు కోసం దశలను ఒక పంట నుంచి మరో పంటకు చేరకుండా జాగ్రత్త తీసుకోవచ్చు.

21న రాజమండ్రిలో మాదిగల ఆత్మీయ సమ్మేళనం

- హాజరవుతున్న మంద కృష్ణమాదిగ
- విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నేతల విజ్ఞప్తి


ఎమ్మార్పీఎస్ ఆత్మీయ సమ్మేళం సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న నేతలు

రాయవరం: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పర్యటనను విజయవంతం చేయాలని ఆ సంస్థ రాష్ట్ర అధికార ప్రతినిధి నేదునూరి రాజేష్ కోరారు. మాదిగ ఎడ్యుకేషన్ ఫెడరేషన్ రాష్ట్ర నేత డోకుబుర్ర రాజుబాబు, మాదిగ న్యాయవాద ఫెడరేషన్ రాష్ట్ర నేత ధూళి జయరాజులతో కలిసి ఆయన రాయవరంలో బుధవారం సమావేశం నిర్వహించారు. రాజేష్ మాట్లాడుతూ మంద కృష్ణమాదిగ నేతృత్వంలో ఈ నెల 21న రాజమహేంద్రవరంలో మాదిగల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నామన్నారు. 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటం ద్వారా సుప్రీం కోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పు ద్వారా ఎస్సీ వర్గీకరణ సాధించామన్నారు. న్యాయపరంగా విజయం సాధించాక, తొలిసారిగా ఉమ్మడి జిల్లాకు వస్తున్న మంద కృష్ణమాదిగ పర్యటనను విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు రాజుబాబు, జయరాజు, జిల్లా నేతలు చుక్కా శేషుకుమార్, దార్ల సతీష్‌కుమార్, లంక చందులు మాట్లాడుతూ 21న జరిగే ఆత్మీయ సమ్మేళనానికి మాదిగలతో పాటుగా, మాదిగ ఉప కులాల వారంతా లక్షలాదిగా తరలి వచ్చి విజయవంతం చేయాలన్నారు. ఆత్మీయ సమ్మేళనం విజయవంతం కోరుతూ ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నేతలు నినాదాలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, ఎమ్మార్పీఎస్ నేతలు చంద్రమళ్ల సంజయ్‌రాజు, లంక శ్రీను, దొండపాటి లక్ష్మణరావు, దువ్వా చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటిన వెదురుపాక విద్యార్థులు


రాష్ట్ర స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులతో హెచ్ఎం, పీడీ

రాయవరం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో వెదురుపాక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారని ఆ పాఠశాల హెచ్ఎం పోలిశెట్టి రాంబాబు బుధవారం తెలిపారు.ఈ పాఠశాల విద్యార్థులు బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచారు. అండర్–19 బాలుర విభాగంలో కాళ్ల రామ చరణ్, కుందేటి రాజు, అండర్–19 బాలికల విభాగంలో గోకాడ గౌరి, పబ్బిన తనుశ్రీ , అండర్–17 బాలుర విభాగంలో కడియాల శివార్జున్, అండర్–14 బాలికల విభాగంలో సూదుల హరిణి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నారు. అండర్–19 బాలుర విభాగంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్టు రాష్ట్ర స్థాయిలో తృతీయ స్థానంలో నిలిచింది. అండర్–19 బాలికల విభాగం తరఫున జిల్లా జట్టు రాష్ట్ర స్థాయిలో నాల్గో స్థానంలో నిలిచింది. రాష్ట్ర స్థాయి జూనియర్స్ బాల్ బాడ్మింటన్ పోటీల్లో ఈ పాఠశాల విద్యార్థిని దంగేటి తేజస్విని జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించింది. ఈ జట్టు రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచింది. బాల్ బాడ్మింటన్ విభాగంలో వివిధ కేటగిరీల్లో సత్తా చాటిన క్రీడాకారులు, కోచింగ్ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ ఎం.కృష్ణ ప్రసాద్‌లను హెచ్ఎం రాంబాబు, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

ఆధునిక వైద్యంపై అవగాహన అవసరం


అతిథి వైద్యులను సత్కరిస్తున్న పీఎంపీలు

కపిలేశ్వరపురం: ఆధునిక వైద్య పద్ధతులపై వైద్య రంగంలో సేవలందిస్తున్న ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని పీఎంపీ వైద్య, విజ్ఞాన సదస్సులో పాల్గొన్న వక్తలు అన్నారు. పడమర ఖండ్రికలోని ఉయ్యాల జంపాల క్షేత్రంలో బుధవారం పీఎంపీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా కపిలేశ్వరపురం మండల శాఖ, రాజు న్యూరో మల్టీ సూపర్ స్పెషాలిటీ (రాజమహేంద్రవరం) హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో మండలంలోని పీఎంపీలు పలు అంశాలపై అవగాహన పొందారు. అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మండల కమిటీ అధ్యక్షుడు గంగుమళ్ల రాంబాబు అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో డాక్టర్ బలభద్ర వెంకటరాజు, రఘువీర్, ఎన్.వినోద్‌కుమార్ మాట్లాడుతూ మెదడు, జీర్ణకోశ, గుండె సంబంధిత సమస్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కపిలేశ్వరపురం సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ చలికాలం నేపథ్యంలో అందించాల్సిన వైద్య సేవలను వివరించారు. అతిథి వైద్యులను పీఎంపీలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కోన సత్యనారాయణ, సూరంపూడి వీరభద్రరావు, కోశాధికారి మట్టా వీరబాబు పాల్గొన్నారు.

రేపు అంగరలో కార్తిక వన సమారాధన

కపిలేశ్వరపురం: అంగరలోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో 16న కార్తిక వన సమారాధన నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆలయంలో స్వామికి ఏకాదశి రుద్రాభిషేకం పూజలు చేయనున్నట్లు తెలిపారు.

ఎన్‌పీసీఐ లింకేజీ అయితేనే లబ్ధిదారులకు డీబీటీ

- మున్సిపల్ కమిషనర్ రంగారావు
- లింకేజీపై సచివాలయ సిబ్బందికి, ఆర్పీలకు అవగాహన


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ రంగారావు

మండపేట: డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) ద్వారా ప్రభుత్వ పథకాల ద్వారా ఆర్థిక ప్రయోజనం పొందాలంటే లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ)కు లింకై ఉండాలని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు సూచించారు. ఈ అంశంపై బుధవారం మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, స్వయం సహాయక సంఘాల రీసోర్స్ పర్సన్ల (ఆర్పీ)కు ఆయన అవగాహన సమావేశం నిర్వహించారు. లబ్ధిదారులు ఎన్‌పీసీఐ లింకేజీ ఏవిధంగా చేయించుకోవాలో వారికి అవగాహన కల్పించారు. ఆర్పీలు, సచివాలయం వెల్ఫేర్ సెక్రటరీలు సంక్షేమ పథకాల లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు ఎన్‌పీసీఐ అనుసంధాన ప్రక్రియ చేపట్టాలన్నారు. అదేవిధంగా లబ్ధిదారుల గణనకు జియో ట్యాగింగ్ ప్రక్రియను కూడా గడువులోగా పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ రంగారావు మాట్లాడుతూ లబ్ధిదారులకు బ్యాంకు ఖాతాలు ఉన్నప్పటికీ వాటిని ఎన్‌పీసీఐతో అనుసంధానం చేయకపోతే ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని కోల్పోవాల్సి వస్తుందన్నారు. దీనికోసం వారం రోజులుగా తపాలా శాఖ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తోందన్నారు. ప్రతి సచివాలయం వద్దా తపాలా ఉద్యోగులు శిబిరాలు ఏర్పాటు చేసి ఎన్‌పీసీఐ లింకేజీ చేపట్టారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో మెప్మా సీఎంఎం పెండ్యాల సుజాత, సీవోలు అరుణకుమారి, వరలక్ష్మి, వార్డు కార్యదర్శులు, ఆర్పీలు పాల్గొన్నారు.

పసలపూడిలో వైభవంగా లక్ష బిల్వార్చన


పసలపూడిలో నిర్వహిస్తున్న లక్ష బిల్వార్చన

రాయవరం: పసలపూడి గ్రామంలో అయ్యప్ప స్వామి లక్ష బిల్వార్చన బుధవారం వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన ఎస్‌వీవీఎస్ఎన్ రెడ్డి (పప్పురెడ్డి గురుస్వామి) ఆధ్వర్యంలో, చింతా సుబ్బారెడ్డి శివస్వామి సౌజన్యంతో ఈ కార్యక్రమం జరిగింది. ఆ గ్రామ శివాలయం వద్ద నిర్వహించిన లక్ష బిల్వార్చనలో భాగంగా ఉదయం ఐదు గంటలకు గణపతి హోమం నిర్వహించారు. ఆగమ పండితులు ఉండి సుబ్రహ్మణ్యశాస్త్రి, సాత్విక్‌శర్మ అర్చకత్వంలో గణపతి హోమం, లక్ష బిల్వార్చన, అయ్యప్పల పడిపూజ నిర్వహించారు. పడిపూజలో భాగంగా అయ్యప్పలు ఆలపించిన భజన గీతాలు, కర్పూరం వెలిగించి అయ్యప్ప పడి పాటకు అనుగుణంగా అయ్యప్ప భక్తులు చేసిన పడి నృత్యం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. చింతా సుబ్బారెడ్డి శివస్వామి సౌజన్యంతో అయ్యప్ప భక్తులు, శివస్వాములకు భారీ అన్న సమారాధన చేపట్టారు. పసలపూడి, రాయవరం, వెదురుపాక, కొమరిపాలెం, రామచంద్రపురం తదితర గ్రామాలకు చెందిన అయ్యప్ప, శివ మాలధారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆధార్ మార్పులు వేగవంతం చేయాలి


కె.గంగవరంలోని ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

కె.గంగవరం: నూతనంగా ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాల వద్ద విద్యార్థుల ఆధార్ కార్డులకు సంబంధించిన మార్పులు, చేర్పుల ప్రక్రియను వేగవంతం చేయాలని ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు సూచించారు. మండల కేంద్రమైన కె.గంగవరం ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 1529 మంది విద్యార్థులకు అపార్ ఐడీ ఇవ్వాలిన అవసరం ఉందని వారికి సంబంధించిన ఆధార్ మార్పులను వేగవంతం చేయాలని సూచించారు. ప్రతి విద్యార్థి ఆయా పాఠశాలలు, సచివాలయాల వద్ద ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాలను సద్వినియోగం చేసుకుని మార్పులను సవరించుకోవాలని ఆయన కోరారు. పాఠశాల హెచ్ఎం పొడగట్లపల్లి వెంకటేశ్వర్లు, సైన్స్ ఉపాధ్యాయులు పీవీ బ్రహ్మానందం, సీనియర్ హెచ్ఎం ఆంజనేయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటు నమోదు చేసుకోవాలి


దుగ్గుదుర్రులో పట్టభద్రుల ఓట్లు నమోదు చేయిస్తున్న శ్రీనివాసుమాస్టారు

కాజులూరు: త్వరలో జరుగనున్న ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు పట్టభద్రులందరూ తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకోవాలని వైఎస్సార్ సీపీ మండల ఎస్సీ సెల్ కార్యదర్శి పోతు శ్రీనివాసుమాస్టారు అన్నారు. మండలంలోని దుగ్గుదుర్రులో ఎమ్మెల్సీ ఓటరు నమోదు శిబిరాన్ని ఏర్పాటు చేసి గత వారం రోజులుగా శ్రీనివాసుమాస్టారు కొత్త ఓటరు నమోదుకు సహాయ సహకారాలు అందిస్తున్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీతో ఓటర్ నమోదుకు గడువు ముగుస్తుందన్నారు. 31 అక్టోబర్ 2021 తేదీ నాటికి డిగ్రీ పూర్తి చేసిన పట్టభద్రులందరూ ఓటు నమోదుకు అర్హులన్నారు. మండల గ్రామాల్లోని వివిధ శాఖల అధికారులు, నాయకులు ఓటు నమోదుకు పట్టభద్రులను ప్రోత్సహించాలన్నారు.

అర్హులకు జర్మనీలో ఉపాధి అవకాశాలు

మండపేట: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీ ఎస్ఎస్‌డీసీ) ద్వారా కల్పించే ఉపాధి అవకాశాలను గ్రాడ్యుయేట్లు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి దండెం శ్రీహరిశేషు బుధవారం ఒక వీడియో ప్రకటనలో పేర్కొన్నారు. జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసి రెండేళ్ల అనుభవం ఉన్న అభ్యర్థులకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జర్మన్ భాషలో శిక్షణ ఇచ్చి, జర్మనీ దేశంలో ఉపాధి అవకాశాలు కల్పిస్తుందన్నారు. ఏపీ ఎస్ఎస్‌డీసీ ద్వారా కూడా పర్సనల్ భాగస్వామ్యంతో జర్మనీలో పని చేయడానికి ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.పైన తెలిపిన విద్యార్హతలు కలిగిన 35 ఏళ్ల లోపు వయసు గల వారు అర్హులన్నారు. ఎంపికైన అభ్యర్థులకు గుంటూరులో ఆరు నెలల పాటు శిక్షణ ఉంటుందన్నారు. జర్మన్ భాషా కోర్సులు ఏ1, ఏ2, బీ1, బీ2 స్థాయిల్లో నేర్పుతారన్నారు. అలాగే ఇంగ్లిష, డిజిటల్ నైపుణ్యం కూడా కలిగి ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఉద్యోగార్హత పొందిన తర్వాత రూ. 2.33 లక్షల నుంచి రూ.3. 26 లక్షల వేతనం ఉంటుందన్నారు.

కులమతాలకు అతీతంగా చిల్డ్రన్స్ డే


చిల్డ్రన్స్ డే వేడుకల చిత్రం


రాయుడు త్రినాథ ప్రసాద్


సబ్బు బిళ్లపై చాచా నెహ్రూ చిత్రం


వాసంశెట్టి ప్రవీణ్ కుమార్

రామచంద్రపురం రూరల్: కులమతాలకు అతీతంగా దేశంలోని పిల్లలందరికీ చాచా నెహ్రూ పుట్టినరోజు పండగే అన్న అర్థం వచ్చేలా చిల్డ్రన్స్‌డేను పురస్కరించుకుని నరసాపురపుపేట జెడ్పీ హైస్కూల్ డ్రాయింగ్ టీచర్ రాయుడు త్రినాథప్రసాద్ వేసిన చిత్రం అందరికీ ఆకట్టుకుంటోంది. స్వతంత్ర భారతదేశానికి చిహ్నంగా మూడు రంగుల్లో బెలూన్‌లు, శాంతి దూతగా పేరొందిన నెహ్రూ హృదయాన్ని చాటేలా శాంతి కపోతం చిత్రం వేసిన విధానానికి పాఠశాల ప్రధానోపాధ్యాయిని కేకేఎల్ కుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

సబ్బు బిళ్లపై చాచా నెహ్రూ చిత్రం

మండలంలోని హసన్‌బాద జెడ్పీ హైస్కూల్‌లో ఎనిమిదో తరగతి విద్యార్థి వాసంశెట్టి ప్రవీణ్ కుమార్ బాలల దినోత్సవం పురస్కరించుకుని సబ్బు బిళ్లపై చాచా నెహ్రూ చిత్రం రూపొందించి అందరి మెప్పు పొందాడు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని పీఎస్‌బీఎస్‌కే సుందరి, చిత్ర కళా ఉపాధ్యాయుడు జి.శ్రీను, ఉపాధ్యాయులు, సహ విద్యార్థులు మెచ్చుకుని అభినందించారు.

రెవెన్యూ సభలను సద్వినియోగం చేసుకోవాలి


మసకపల్లి రెవెన్యూ గ్రామ సభలో మాట్లాడుతున్న ఎంపీపీ నాగమణి

కె.గంగవరం: గ్రామాల్లో జరుగుతున్న రెవెన్యూ గ్రామ సభలను రైతులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ పి.నాగమణి అన్నారు. మండలంలోని మసకపల్లిలో జరుగుతున్న గ్రామ సభలో ఆమె పాల్గొని మాట్లాడారు. గతంలో జరిగిన రీసర్వేలో రైతులకు ఎటువంటి సమస్యలు వచ్చిన ఈ గ్రామ సభల్లో రాతపూర్వకంగా ఫిర్యాదు అందిస్తే రెవెన్యూ అధికారులు సంబంధిత సమస్యను పరిష్కరిస్తారన్నారు. చాలా వరకు రీసర్వేలో భూ సమస్యలను పరిష్కారం అయ్యాయని ఇంకా గ్రామాల్లో ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరించుకోవాలని కోరారు. ప్రతి గ్రామంలో ఈ రెవెన్యూ సదస్సులు జరుగుతాయని ఆమె పేర్కొన్నారు. సర్పంచ్ పిల్లి అన్నపూర్ణ, ఆర్ఐ వెంకట్రావు, సర్వేయర్ పావని రెవెన్యూ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆకతాయిలు వేధిస్తే భరతం పడతాం


విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఏఎస్ఐ చిన్నారావు

మండపేట: మహిళలు, బాలికల సంరక్షణ కోసం అమలవుతున్న చట్టాలపై విద్యార్థినులకు పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. గుమ్మిలేరు రోడ్డులోని వైష్ణవి ఒకేషనల్ కళాశాల విద్యార్థినులకు పట్టణ ఏఎస్ఐ చిన్నారావు బుధవారం పలు విషయాలు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. మహిళా సంరక్షణ చట్టాలపై విద్యార్థినులు అవగాహన పెంచుకోవాలన్నారు. కళాశాలలకు వెళ్లేటప్పుడు, ఇంటికి తిరిగి వచ్చేటప్పుడు ఆకతాయిలు ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. వెంటనే అక్కడకు చేరుకుని ఆకతాయిల భరతం పడతామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నక్కా చంద్రరావు, కాలేజీ నిర్వాహకుడు కోనే వీర్రాజు, విద్యార్థినులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కన్నుల పండువగా జనార్దనస్వామి తెప్పోత్సవం


హంస వాహనంపై ఊరేగుతున్న శ్రీదేవి, భూదేవి సమేత జనార్దనస్వామి వారు

మండపేట: స్థానిక శ్రీదేవి భూదేవి సమేత జనార్దనస్వామి వారి తెప్పోత్సవం కనుల పండువగా జరిగింది. క్షీరాబ్ది ద్వాదశి పర్వదినమైన బుధవారం స్వామివారి తెప్పోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ ఏడాది ఉత్సవాన్ని స్థానిక వైఎస్సార్ పార్కు ఆవరణలోని బురుగుంట చెరువులో జరిపించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఉత్సవాన్ని ప్రారంభించారు. అంతకు ముందు శ్రీదేవి భూదేవి సమేత జనార్దన స్వామి వార్లను పల్లకీలో ఉంచి రథం ఆలయం నుంచి గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయ ఈవో కామేశ్వరరావు ఆధ్వర్యంలో మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, బాణసంచా కాల్పుల మధ్య స్వామి అమ్మవార్లను బురుగుంట చెరువు వేదిక వద్దకు తీసుకువచ్చారు. ప్రత్యేకంగా చెరువులో ఏర్పాటు చేసిన హంస వాహనంపై ఉంచి అర్చకులు, వేద పండితులు పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బిక్కిన కృష్ణార్జున చౌదరి, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా మాజీ అధ్యక్షుడు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, నల్లమిల్లి వీర్రెడ్డి, సీతారామా క్షేత్రం నిర్వాహకుడు మల్లిపూడి గనేశ్వరరావు ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు. విశేష పూజల అనంతరం స్వామివారు హంస వాహనంపై బురుగుంట చెరువులో నలు దిక్కులా విహరించారు. చెరువు చుట్టూ ఏర్పాటు చేసిన అఖండ దీపాలంకరణ, విద్యుత్ దీపాలు, మిరుమిట్లు గొలిపే బాణసంచా కాల్పుల నడుమ స్వామివారి తెప్పోత్సవం సాగింది. వేలాదిగా తరలి వచ్చి స్వామి దర్శనం చేసుకున్నారు. ఎస్ఐ హరికోటి శాస్త్రి నేతృత్వంలో పట్టణ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.